Journal of Frontiers in Multidisciplinary Research

# మూసతో సాహిత్యానికి ముప్పు

**డా.బెల్లి యాదయ్య**

తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్రం, ఇండియా

* Corresponding Author: **డా.బెల్లి యాదయ్య**

**Article Info**

**E-ISSN:** 3050-9726
**P-ISSN:** 3050-9718
**Volume:** 02
**Issue:** 02
**July - December** 2021
**Received:** 20-05-2021
**Accepted:** 13-06-2021
**Published:** 07-07-2021
**Page No:** 357-359

**Abstract**

ఈ వ్యాసం సాహిత్యంలో మూస ధోరణి (Routine Trend), సాహిత్య వ్యర్థం (Literary Waste), మరియు నూతన సృజన మధ్య ఉన్న అంతరాన్ని విశ్లేషిస్తుంది. పూర్వ సాహిత్య సంప్రదాయాలను అధ్యయనం చేయడం అవసరమే కాని, వాటిని యథాతథంగా అనుకరించడం సాహిత్య సృజనాత్మకతను క్షీణింపజేస్తుందని రచయిత వివరిస్తారు. ప్రాపంచిక అవగాహన, సమకాలీన సామాజిక చైతన్యం, సిద్ధాంతపరమైన అధ్యయనం, క్షేత్రస్థాయి అనుభవం, భాషా నైపుణ్యం, శిల్ప వైవిధ్యం వంటి అంశాలే గొప్ప రచనలకు పునాదులని ప్రతిపాదించారు. టి.ఎస్. ఇలియట్, కె. బాలగోపాల్, ఫిలిపా కె. చాంగ్, మాంటెక్ సింగ్ అహ్లువాలియా వంటి ఆలోచనాపరుల అభిప్రాయాలను ఉదాహరణగా తీసుకొని సాహిత్యానికి నవ్యత, సామాజిక దృక్పథం, వ్యక్తిగత సృజనాత్మకత ఎంత అవసరమో విశదీకరించారు. రచయిత సమాజాన్ని ప్రభావితం చేసే భావప్రసారకుడిగా ఉండాలని, అనుకరణకు బదులుగా వైవిధ్యభరితమైన వస్తు–శిల్పాలతో సాహిత్యాన్ని సమృద్ధి చేయాలని సూచించారు. సాహిత్య ప్రగతికి నవ్య దృక్పథం, విమర్శనాత్మక అధ్యయనం, సామాజిక బాధ్యత, సృజనాత్మక స్వాతంత్ర్యం అనివార్యమని ఈ వ్యాసం నిర్ధారిస్తుంది.

**DOI:** https://doi.org/10.54660/.IJFMR.2021.2.2.357-359

**Keywords:** మూస ధోరణి (Routine Trend), సాహిత్య వ్యర్థం (Literary Waste), నూతన సృజన, సామాజిక దృక్పథం, సాహిత్య విమర్శ

## 1. Introduction

సాహిత్యంలో పాత కొత్తల మేలు కలయిక కాకుండా గాలివాటంగా కొట్టుకు పోయే ధోరణి ఒకటి ఎప్పుడూ ఉంటుంది.ఏ కాలపు కవులు రచయితల కైనా తమకు ముందు కవులు రచయితలు ఉంటారు.వాళ్లు ఏదో ఒక ధోరణిని అనుసరించి రాస్తారు. ఆ ధోరణిని ఆ కవులు రచయితలు అప్పటి రాజకీయ వాతావరణం నుంచో, సామాజిక అస్తిత్వ సంవేదనల నుంచో,ఆర్థిక స్థితి గతుల ఆరాటాల నుంచో , ఉత్పత్తి సంబంధాల్లోంచో, సాంస్కృతిక ఆదాన ప్రదానాల్లోంచో,వైయక్తిక జీవన సంఘర్షణల్లోంచో, ఆచారాలు సంప్రదాయాలు పరిపోషించే ఎత్తుపల్లాలపై సంకల్పించిన నిరసనల్లోంచో సృష్టిస్తారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా చేయబడిన సృజన కాబట్టి ఆ ధోరణికి జనామోదం,జనాదరణ ఉంటుంది.ఐతే తదనంతర కవులు రచయితలు అదే ధోరణిలో రాస్తే' కొట్టుకు పోయే ధోరణి ' అంటారు.దీన్నే మూస ధోరణి(Routine Trend)'అని కూడా అంటారు.కవిత్వం,కథ,నవల,నాటకం ప్రక్రియ ఏదైనా దానిలోకి కొత్త గొంతులు చేరి పలికినపుడే ఆ సాహిత్య రూపం పరిపుష్టం అవుతుంది. ఆ కొత్తగొంతులు వస్తుశిల్పాల నిర్దిష్ట లక్ష్యాలను విస్తృత పరచినప్పుడు,సమాజ చలనసూత్రాలను మార్చగలిగినపుడు లేదా మలుపు తిప్పగలిగినపుడు ఆ వస్తుశిల్పాలకు ఆ నవ రచయితలకు ఆ ధోరణిలో భాగంగా వ్యాప్తి,ప్రమాణం రెండూ సమపాళ్లలో సిద్ధిస్తాయి.ఈ వ్యాప్తి ప్రమాణాలను దృష్టిలో

ఉంచుకొని తాము కూడా అట్లా రాస్తేనే గుర్తింపబడతాం అనే భ్రమలో గత వస్తుశిల్పాల్లో ఎక్కడా ఏ కొలతలు మార్చకుండా చేసే రచనలన్నీ మూసరచనలు అవుతాయి. ఈ రచనల వలన సమాజానికీ సాహిత్యానికీ భారీనష్టం వాటిల్లుతుంది. దీని వల్ల అటు సమాజానికీ సాహిత్యానికి ఏ ప్రయోజనం ఉండదు కాబట్టే ఈ రచనలను 'వృధా సాహిత్యం లేదా సాహిత్య వ్యర్థం (literary waste) అంటారు.ఈ కోవలోకి చేరే నిస్సారమైన పుస్తకాల వల్ల ముద్రణా సంస్థలకు తప్ప మరొకరెవ్వరికీ నయా పైసా లాభం ఉండదు.ఇంకా సాహసించి నిర్మొహమాటంగా ఘాటుగా చెప్పాల్సి వస్తే పుస్తకాల కోసం చెట్లు నరకబడి అడవులు తరగిపోయి పర్యావరణానికి కీడు వాటిల్లుతుంది.ఇదే జరిగితే సమాజ హితం కోరి రాస్తున్నామని చెప్పే రచయితలే ప్రకృతి పాలిట అహితులు( కౌటిల్యుడు చెప్పిన అహితులు కాదు)గా దాపురిస్తారు.

అసలైన సృజనకు కావలసిన భావగత నేపథ్యం,లేఖనా సంబంధ అభ్యాసం రెండూ కొరవడినందువల్లే రచయితలు మూస లేదా వృధా రచనలు చేస్తారు. హేతుబద్ధ సృజన,కాల స్పృహ, భావజాల పరిణతి ఎంతమాత్రం లేకుండా కేవలం రచయితలం అనిపించుకోవడానికి చేసే రచనలకు సాహిత్య వ్యర్థాలకు కూడా అద్భుతం,అపురూపం అని కొందరు పెద్దలు ముందు మాటలు ప్రవాహనిష్ఠగా రాస్తారు.ఇట్లా రాయడం ఎటువంటిదంటే దారితప్పిన వాణ్ణి మరింత ద్రిమ్మరిని చెయ్యడం లాంటిది. వీటి ఆవిష్కరణలకూ పెద్దలు దూర దూరాలనుంచి వస్తారు.మిత్రులు చేయికొద్ది సమీక్షించి గ్రంథాలను ఆకాశానికెత్తుతారు.ఇక సాహిత్య వ్యర్థాల ఉత్పాదకుల వీగుడుకు, ప్రగల్భాలకు గంపలూ గరిసెలు సరిపోవు.రచయితల సంఖ్య పెరగాల్సిన అవసరానికి,రచనల ప్రతిపత్తి పెరగాల్సిన సందర్భానికి మూస సాహిత్యం పూర్తి విఘాతం కల్గిస్తుంది. ఐతే వర్తమాన రచయితలు, వర్తమాన కవులు పూర్వపండితులను అనుసరించకూడదా?అనే ప్రశ్న వస్తుంది.దీనికి సమాధానం;అనుసరిస్తే తప్పు లేదు,అనుకరిస్తేనే తప్పు. ఇక్కడ టి.ఎస్ ఇలియట్ మహానుభావుడు 'Tradition of the individual talent (1919)' వ్యాసంలో చేసిన ఆసక్తికరమైన వ్యాఖ్య "The literary past must be integrated into contemporary poetry. But the poetry must guard against excessive academic knowledge and distill only the most essential bits of the past into poem, thereby enlightening readers." లో కవులకు రచయితలకు అనుకరణ సందర్భంలో అవసరమైన మార్గదర్శనం కనిపిస్తుంది. ఒక తరం వాదనలు,భావజాలం, వస్తు శిల్పాల ముద్రలు అనంతర తరం మీద అనివార్యంగా ఉంటాయి.కేవలం వాటి నెమరువేతకో ,తిరిగి వాటినే చెప్పడానికో పరిమితమైతే రచనలకూ ఏ సార్థకత ఉండకపోగా , ఆ రచయితలు కనీసం ప్రాతినిధ్య రచయితలుగా కూడా మిగలలేరు. పూర్వకవుల ప్రతిభా విశేషాలను ఏమేరకు అవసరమో అంతమటుకే తీసుకుని కొత్త తోవలకు,శిఖరాలకు సాహిత్యాన్ని నడిపించకపోతే ఆ సాహిత్యం సమాజంలోని ఏ వర్గాలకూ ప్రేరణ కాదు కదా రసానుభూతిని సైతం ఇవ్వలేదు, పైపెచ్చు ఒక అనుకరణ సమూహం ఏర్పడి సాహిత్య విలక్షణతకు సాహిత్యంలో కాలిక చైతన్యానికి తీవ్ర అగాధం ఏర్పడుతుంది. దానితో ఆ కాలానికి ఆ స్థలానికి ఆ ప్రజాజీవితానికి సమకూరవలసిన సాహిత్య ప్రతిపత్తి లభించకుండా పోతుంది.అటువంటి కాలాన్ని శూన్యం యుగం అంటారు. శూన్యం యుగంలో ఏ నాలుగైదో తప్ప,మిగతావన్ని శుష్క ప్రసంగాలుగా మిగిలిన అనుభవం మన తెలుగు సాహిత్యానికి ఇదివరకే ఉంది.ఒక జాతి ప్రజల జీవితంలో మంచి పంటలు పండని కాలం ఎటువంటిదో,మంచి రచనలు రాని కాలం కూడా అటువంటిదే.

సృజన నూతన పుంతలు తొక్కడానికి కవులకు రచయితలకు ప్రధానంగా ఉండాల్సిన మూలధాతువులు ప్రాపంచిక అవగాహన, సాహిత్య అధ్యయనం .వీటికి ద్విముఖాలు. ఒకటి సిద్ధాంత పరమైంది(Theoretical),రెండోది ఆచరణాత్మకమైంది(practical). కేవలం గ్రంథపఠనం చేయడం ద్వారా అబ్బేది సిద్ధాంతం. క్షేత్ర స్థాయికి వెళ్లడం ద్వారా సమకూరేది ఉత్పాదకతా సామర్థ్యం. చాలా మంది రచయితలు ఈ రెండు పద్ధతుల్లో కనీసం మొదటిదైన సిద్ధాంతాన్నైనా అధ్యయనం చేయరు.లోకంలో వినికిడిలో ఉన్న సిద్ధాంతానికి కరణీకం చేస్తూ,సిద్ధాంత పరిణామాలను ,మూల్యాంకనాలను సైతం పట్టించుకోకుండా సాంఘిక నియమాల(social principles)ను,సాధారణ నీతుల(general morals)ను గేయాలుగానో,పద్యాలుగానో ,కవితలుగానో, కథలుగానో కనీస శిల్పం లేకుండా అక్షరాలను పోగేస్తుంటారు.ఇవి మౌఖిక సాహిత్యంలోని సామెతలు పొడుపు కథల స్థాయికి కూడా సరిపోలవు.ఇట్లా కాకుండా ప్రాపంచిక విషయాలను ఆకళింపు చేసుకోవడంలో,స్థలకాలాల భావుకత భావజాలాలను అన్వయించుకొని తానున్న చోటగల ప్రజాజీవితంతో సృజన కార్యాన్ని సమన్వయం చేయగలిగితే మూస నుంచి, అనుకరణ నుంచి రచయితలు అలవోకగా బయటపడతారు.సారవంతమైన రచనలు చేయగలుగుతారు.కానీ,కొందరు అపరిపక్వత వల్ల,అహంవల్ల,నేర్చుకోలేని తనం వల్ల తాము గిరిగీసుకున్న గీతలవద్దనే నిలబడి గుండం తిరుగుతారు.నవ్యతను అందుకోలేరు.ఎప్పుడైతే ప్రపంచంలో ఆయా చోట్ల వెలుగుచూస్తున్న నూతన రచనలను చదువరో,ఆ నవ్యత ఇచ్చిన స్ఫూర్తిని పుణికిపుచ్చుకోలేరో రచయితలు ఆగిపోతారు.ఆగి పోయిన రచయితలు సాహిత్యాన్ని ముందుకు నడిపించలేరు.సాహిత్యం ముందుకు నడవకపోతే అక్కడి సమాజం కూడా ఆగిపోయిన రచయితలతో పాటు జడమయం అవుతుంది.ఎప్పుడైతే జడత్వం ఆవరిస్తుందో వెనువెంటనే తిరోగమన విలువలు ఆ క్షేత్రాలతో జతకడతాయి.విశృంఖలం చేయడానికి మళ్లీ వైతాళికులు పుట్టాలి.

చాలా మంది అనుకున్నట్టుగా ఒక్క సంప్రదాయ ధోరణికే మూస రచయితలు ఉండరు,కార్మిక శ్రేణులు అమితంగా ఆరాధించే సామ్యవాద రచయితల్లోనూ మూసధోరణి ఉంటుంది.మూస ధోరణికి కారణాలను ప్రఖ్యాత సామాజిక విశ్లేషకులు కే.శే.కె.బాలగోపాల్ ఇట్లా " మన కళ్లముందు ఉండీ మనం చూడని,చూడజాలని విషయాలనేకం ఉంటాయి.కొన్ని భయం వల్ల చూడం.కొన్ని అభద్రత వల్ల చూడం.కొన్ని బలమైన భావజాల ప్రభావంవల్ల మన

ఎదుట ఉండీ మనకు కనిపించవు.ఒక్కొక్కసారి మనకు అలవడిన దృక్కోణం వల్లగానీ,మనం ఎంచుకున్న దృక్కోణంవల్లగానీ,కొన్ని విషయాలు మన కళ్లముందే ఉండీ మనకు కనిపించవు.వీటిలో విడివిడి విషయాలే కావు,సామాజిక క్రమాలు ఉంటాయి.వీటిని మనకు చూపించడం సాహిత్యం చేసే పనులలో ఒకటి" అంటూ విడమరచారు. ఈ వ్యాఖ్యానం ఒక్క తెలుగు సాహిత్యానికే కాదు యావత్ప్రపంచ సారస్వతాలకూ దిక్సూచి వంటిది.రచన ఆషామాషీ వ్యవహారం కాదు.రచయిత ఓ గొప్ప భావ ప్రసారకుడు.రచతయితలో కేవలం కలం కాగితం పట్టుకున్న లేఖకుడే ఉండడు.చాలా లోతుల్లోకెళ్తే రచయితలో ఒక మానసిక శాస్త్ర నిపుణుడు,ఒక పరిశోధకుడు,ఒక పరిశీలకుడు,ఒక బుద్ధి కుశలుడు,ఒక దార్శనికుడు వెరసి ఒక మూర్తీభవించిన భాషాకోవిదుడు ఉంటారు.ఈ కోవకు చెందిన రచయితలనే రచనా నిపుణులు(skilled writers)అంటారు.వీళ్లే సాంస్కృతిక చైతన్యంతో పాటు నూతన ప్రయోగాలతో భాషాభివృద్ధికి పాటుపడతారు,సమాజాన్ని సాహిత్యాన్ని ప్రభావితం చేస్తారు.ఏ యేటికాయేడు నదిలోకి కొత్త నీరు వచ్చినట్టు ఏ యుగానికి ఆ యుగంలో సాహిత్యంలోనికి కొత్త ప్రక్రియలు వస్తాయి.అట్లా వచ్చిన ప్రక్రియలతో ఇవాళ సాహిత్యంలో కవిత్వం(పాటు,పద్యం,వచన కవిత),కథ,నవల,నాటకం,వ్యాసం,లేఖలు,జీవిత చరిత్ర,ఆత్మకథ, జ్ఞాపకాలు-అనుభవాలు,యాత్రారచన,ప్రసంగ రచన వంటి పదకొండు ప్రక్రియలు వెలిశాయి.గత దశాబ్ద కాలాన్ని గమనిస్తే భిన్న రంగాలకు చెందిన ప్రముఖులు వెలువరించిన ఆత్మకథలు,జీవిత చరిత్రలు,యాత్రారచనలు,అనుభవాలు-జ్ఞాపకాలు,ప్రసంగం రచనలు ఎంతో వైవిధ్యాన్ని కలిగి అత్యంత పాఠకాదరణ పొందాయి.

ఇటీవల వచ్చిన ప్రముఖుల ఆత్మకథల్లో ' BACK STAGE ' ఒకటి.ఇది సుప్రసిద్ధ ఆర్థికవేత్త,ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా జీవన గ్రంథం. అహ్లువాలియా ఈ పుస్తకానికి తనమాట(Prologue) రాస్తూ " I present this book to the reader as a travelogue of India's journey of economic reforms, in which I had the privilege of being an insider for 30 long years. My own story is interwoven with the narrative, but the personal experiences are not the principal focus; they are offered to the reader as an additional insight into what influenced my decisions and, quite possibly, my biases, as I saw India's growth and development story unfold." అంటాడు.ఈ మాటల్లో ఒక గ్రంథంలోని విషయం వ్యక్తినిష్ఠ కంటే సామాజిక నిష్ఠను కలిగివుండడమే ప్రధానమని,చెప్పే విషయం ఏదైనప్పటికీ రచయితతో పాఠకుడు మమేకం కాగలిగే సంఘటణా సంపత్తి, ప్రయాణం చేయగలిగే శైలి, రచనకు అతిముఖ్యమైనవని తెలుస్తుంది. కొత్తగా రచనలు చేసే వాళ్లు ముఖ్యంగా నాలుగు అంశాలను గుర్తుంచుకోవాలి. ఏ ప్రక్రియలో రాస్తున్నాం అనేది మొదటిది,ఏ ఇతివృత్తం రాస్తున్నాం అనేది రెండోది, ఏ భావజాలం రాస్తున్నాం అనేది మూడోది,ఎవరిని లక్ష్యంగా ఏ ప్రయోజనాల కోసం రాస్తున్నాం అనేది నాల్గోది.ఈ నాల్గు అంశాల్లో చూపే వివేకం ఒక రచయితకు స్థాయిని కల్పిస్తుంది.ఎక్కడా ఎవరితోనూ దేనితోనూ పోలికలు లేని కొంగ్రొత్త తాజాతనం రచనలో సాక్షాత్కరిస్తే అది కలకాలం పాఠకుల మన్నన పొందగలుగుతుంది. కెనడాకు చెందిన మెక్ మాస్టర్ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు Phillipa K.Chong తన విమర్శా గ్రంథం 'Inside the Critics' Circle ' లో పేర్కొన్నట్టు రచనకు సామాజిక దృక్పథం(sociological perspective), విశేష రుచి(idiosyncratic taste) అనే రెండు గుణాలు తప్పనిసరిగా ఉన్నప్పుడు ఆ కృతి,తత్ కర్త ఆ ప్రక్రియలో మేలుబంతి వలె పరిమళించడం తథ్యం. ఇవేం అవసరం లేదు,గతంలో వచ్చిన యాసబాసలను పట్టుకు ఊహకొచ్చింది రాస్తాం, ఊక దంచి కుప్ప పోస్తాం అనుకుంటే అటువంటి రచనలు వ్యర్థ రచనలు అవుతాయి, ఆ రచయితలు మూస రచయితలుగా మిగిలిపోతారు. ముందే చెప్పినట్టు మూస రచనల వల్ల సాహిత్యానికి సమాజానికి ఇసుమంత ఉపకారం ఉండకపోగా, సాహిత్య కర్తవ్యాలకు పెను ముప్పు దాపురిస్తుంది.రాశి పెరిగి వాసి కొరవడినపుడు ఆ సాహిత్యం మిగతా భాషల సాహిత్యంతో తూగలేదు.వస్తు వైవిధ్యం,రూపం వైవిధ్యం,గుణ వైవిధ్యం రచనలకు పాఠకులూ ఉన్నారు,మార్కెటూ ఉంది,సాంకేతిక ఆధునికీకరణలో ఇతర భాషల్లోకి అనువాదాలకు నాజూకైన ద్వారాలూ తెరచి ఉన్నాయి. కావాల్సిందల్లా కవులు రచయితలు నూతన సృజనకు సర్వశక్తులతో పూనుకోవడమే.

**References**


1. Eliot, T. S. (1919). Tradition and the Individual Talent. The Egoist.
2. Sartre, Jean-Paul. (1967). What Is Literature? Methuen & Co., London.
3. Chong, Phillipa K. (2020). Inside the Critics' Circle: Book Reviewing in Uncertain Times. Princeton University Press.
4. Ahluwalia, Montek Singh. (2020). Backstage: The Story Behind India's High Growth Years. Rupa Publications.
5. బాలగోపాల్, కె. (2009). సాహిత్యం, సమాజం మరియు సామాజిక దృక్పథం (వ్యాసాల సంకలనం). హైదరాబాద్.